# కప్పల రాజు

మానం పద్మజ

అనగా అనగా ఒక ఊరు.

ఆ ఊరికావల ఒక తటాకం.

ఆ తటాకంనిండా కుప్పతెప్పలుగా కప్పలు నివసించేవి. వానాకాలం రాగానే బెకబెకమంటూ గెంతులు వేసుకుంటూ అటూఇటూ చెంగు చెంగున దూకుతుండేవి. వాటి పాదవైన నాలుకలు చాచి క్రిమికీటకాల్ని గుటుక్కున మింగుతుండేవి. వాటికి పరిస్థితులన్నీ సజావుగానే సాగుతుండేవి. అవి ఆడింది ఆటగా పాడింది పాటగా జరిగేది. దాంతో కొంతకాలం తరువాత వాటికి జీవితం ఒకేరకంగా అన్పించి విసుగుచెందాయి.

'బావిలో కప్పల్లాగా మనం కూడా ఈ తటాకంలోనే మగ్గిపోతున్నాం. చుట్టుపక్కల ప్రపంచంలో ఏం జరుగుతుందో మనకసలేం అర్థం కావట్లేదు' అనుకున్నాయి. అనుకున్నదే తడవుగా ఒక పెద్ద బావురుకప్పను పిలిచి చుట్టుపక్కల ప్రపంచంలో ఏం జరుగుతుందో చూసి రమ్మన్నాయి. పెద్దరికం ఇచ్చిందే తడవుగా అది బెకబెకమని గెంతులు వేసుకుంటూ వెళ్ళింది. దాని రాక కోసం మిగతా కప్పలన్నీ ఆత్రుతగా ఎదురు చూడసాగాయి.

బావురుకప్ప భారంగా తిరిగివచ్చింది. కప్పలన్నీ దాన్ని చుట్టుముట్టాయి. అదేం చెప్పబోతుందో అని చెవులు రిక్కించాయి.

బావురుకప్ప చెప్పటం ప్రారంభించింది.

"మనం ఇంతకాలం తటాకంలో నివసిస్తున్నప్పటికీ బావిలో కప్పల్లాగానే బతికాం. ఎవరి దోవన వారు తిండి సంపాదించుకుంటూ ఆడుతూ పాడుతూ ఇంకొకళ్ళతో సంబంధం లేనట్లున్నాం. బయట ప్రపంచంలో ఇలా లేదు. అడవిలో జంతువుల్ని పాలించడానికి మృగరాజు వున్నాడు. మానవ సమాజంలో మనుషుల్ని పాలించడానికి రాజులున్నారు. ఆఖరికి అతి చిన్న జీవులయిన చీమలకి కూడా రాణులున్నారు. మనల్ని పాలించటానికే ఎవరూ లేరు" అని చెప్పింది.


"అయ్యో! అకటా!! ఎంత విచారకరమైన విషయం" అని కప్పలు దిగులుపడ్డాయి. ఏం చేయాలి... ఏం చేయాలి... మనమూ మిగతా వాళ్ళలాగే నాగరికులం అన్పించుకోవాలంటే ఏం చేయాలి...? అనుకున్నాయి.

ఏం చేయాలో ఆలోచించి చెప్పటానికి ఒక కప్పల కమిటీని వేశాయి. కమిటీ ఆలోచించి ఒక రోజులో రిపోర్టు ఇవ్వాలని సూచించాయి. కప్పల కమిటీ యేమో కప్పదాట్లు వేసుకుంటూ మొత్తానికి ఒక నెలకి దాని రిపోర్టు ఇచ్చింది. 'మనమందరం కలిసి దేవుడి దగ్గరికి వెళ్ళి మాకూ ఒక రాజుని ప్రసాదించమని వేడుకొందాం' అని కప్పల కమిటీ తీర్మానించింది.

సరే అంటే సరే అనుకున్నాయి కప్పలు.

దేముడ్ని కలవటానికి కప్పలన్నీ ఊరేగింపుగా వెళ్ళాయి. ద్వారపాలకులు వాటిని బయట గుమ్మం దగ్గరే ఆపేసి లోపలకు వెళ్ళటానికి వీల్లేదన్నారు.

కప్పలన్నీ 'దేవుణ్ని కలవాలంటే కలవాల్సిందే, మా కష్టం చెప్పుకోవాల్సిందే' అని బెకబెకమంటూ నినాదాలిచ్చాయి. ద్వారపాలకులు వాటి బెకబెకలు భరించలేక దేవుడి దగ్గర పర్మిషను




తీసుకుని కొన్ని కప్పల్ని మాత్రమే లోపలకు పంపించారు.

లోపలకు వెళ్ళిన కప్పల డెలిగేషన్ దేవుడితో తమ లోటును చెప్పుకున్నాయి.

"దేవుడా! దేవుడా!! అందరికీ పాలించే నాయకులున్నారు. పరిపాలించే నాథుడు లేక మేమెవరికి వారై అనాగరికంగా గంతులేస్తున్నాం. దయవుంచి మాకూ ఒక నాయకుణ్ని ప్రసాదించమని" వేడుకున్నాయి.

**తమ కష్టనష్టాల్ని తీర్చాల్సిన రాజే తమను బలితీసుకుంటుంటే ఇన్నాళ్ళూ ఆనందంతో బెకబెకమని తిరిగిన కప్పలు బావురుమనసాగాయి**

దేవుడు ప్రసన్న వదనంతో "నేను మిమ్మల్ని ఉద్ధరించటానికే ఇక్కడ వున్నాను. మీకు తప్పకుండా ఒక నాయకుణ్ని ఇస్తాను. ఇదిగో... మీలో ఈ గోదురు కప్పనే మీకు రాజును చేస్తున్నాను. వెళ్ళి తరించండి" అని వరమిచ్చాడు.

కప్పలన్నీ ఆనందంగా తిరిగి ఒక్క గంతులో తటాకాన్ని చేరుకున్నాయి. కానీ, కొత్తగా ఏర్పాటు చేసుకున్న రాజువల్ల వాటి జీవన విధానంలో ఎటువంటి మార్పు కన్పించలేదు.

గోదురు కప్పరాజు కూడా వాటితోపాటే గంతులేసుకుంటూ ఆహారం వెతుక్కుంటూ తిరుగుతుండేది. దాన్ని చూస్తే ఎవరికీ 'ఇది మా రాజు' అని అనుకోబుద్ధయ్యేది కాదు. 'ఇటువంటి రాజు మాకెందుకు?' అనుకున్నాయి కప్పలు.

దాంతో మళ్ళీ ఒక కప్పల డెలిగేషన్ దేవుణ్ని కలిసింది. ఈసారి దేవుడికి కొంచెం విసుగేసింది. 'నేను ఒకసారి పరిష్కారం చేసివ విషయం మళ్ళీ పునరాలోచించటమా!' అనుకున్నాడు. అయినా విసుగుని కన్పడనీయకుండా 'సరే! మీ సమస్యని సావధానంగా చెప్పండి' అని దయ తలిచాడు.

"దేవుడా! దేవుడా!! ఈ గోదురు కప్పను చూస్తే మాకస్సలు రాజనే అన్పించట్లేదు. మాలోనే ఒకడ్ని రాజుగా చేస్తే ఎలా? మా రాజుని మా గుంపు నుంచి కాకుండా వేరే ప్రసాదించు" అని మొరపెట్టుకున్నాయి.

దేవుడు కొంచెంసేపు ఆలోచించాడు. సాలోచనగా తల పంకించాడు. 'సరే! మీరు నివసించే తటాకంలో ఒక దుంగ పడివుంది కదా! ఇక నుండి అదే మీ రాజు, ఫోండి' అని కప్పల్ని పంపేశాడు.

ఆహా! మనకు వేరే కొత్తరాజు వచ్చాడు కదాని అవి ఆనందంగా గెంతుకుంటూ తటాకానికి వెళ్ళిపోయాయి.

కొన్ని రోజులకే తటాకంలోని కప్పలకి మళ్ళీ అసంతృప్తి మొదలయ్యింది. 'దుంగరాజు బహు మొద్దురాజు. ఉలకడు. పలకడు. తమ కష్టం నిష్టూరం ఆయనతో చెప్పుకోవటానికి లేదు. ఇంతకు ముందు గోదురు కప్పరాజు కనీసం తమతోపాటు తిరిగేవాడు. కష్టం సుఖం దానికి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేకుండానే అర్థంచేసుకునేవాడు. స్వజాతీయుడే కాబట్టి సమస్యలు పరిష్కారం అయినా కాకపోయినా కనీసం సానుభూతి అన్నా వుండేది. ఈ దుంగరాజు శుద్ధదండగ. ఈయన వున్నా ఒకటే లేకపోయినా ఒకటే' అని అనుకున్నాయి.

అనుకున్నదే తడవుగా మళ్ళీ ఒక డెలిగేషన్ దేవుడి దగ్గరికి బయల్దేరింది. ఈసారి దేవుడు వాటికి రెండు రోజుల వరకూ అప్పాయింట్‌మెంట్ ఇవ్వలేదు.

కప్పల డెలిగేషన్ కూడా 'ఏమయినా సరే దేవుణ్ని కలవాల్సిందే, కొత్త రాజుని పొందాల్సిందే' అని చాలా పట్టుదలగా వుంది.

ఎట్లా అయితే ఏమి, మొత్తానికి అతి కష్టం మీద దేవుడు వాటికి ఐదేఐదు నిముషాలు సమయం ఇచ్చాడు. కప్పలు తమ కష్టాన్ని దేవుడికి ఏకరువు పెట్టాయి.

అంతా విన్న దేవుడు, "సరే! ఇదే ఆఖరుసారి. మీకు ఈసారి అతి చురుకైన రాజుని ఇస్తున్నాను. ఫోండి" అని చురుకైన ఒక పాముని రాజుగా కప్పలకు ప్రసాదించాడు.

కప్పలన్నీ ఆ దెబ్బతో కిక్కురుమనకుండా పామురాజు వెంటరాగా బిక్కుబిక్కుమని తటాకాన్ని చేరుకున్నాయి.

ఆ రోజు నుంచి చురుకయినా ఆ పామురాజు పాలసీ మేటర్‌లా ఆకలేసినప్పుడల్లా తటాకంలో గెంతులేసే కప్పల్ని నోట కరుచుకుని మింగసాగాడు. తమ కష్టనష్టాల్ని తీర్చాల్సిన రాజే తమను బలితీసుకుంటుంటే ఇన్నాళ్ళూ ఆనందంతో బెకబెకమని తిరిగిన కప్పలు బావురుమనసాగాయి.

'మళ్ళీ దేవుడి దగ్గరకెళ్ళడానికి వాటికి ధైర్యం చాలలేదు. వెళ్ళకపోతే ఈ పాము రాజు పాలసీలకి తటాకంలోని కప్పలన్నీ బలవ్వాల్సిందే. ముందుకెళ్తే నుయ్యి. వెనక్కొస్తే గొయ్యి. మొదటిసారి దేవుణ్ని ప్రార్థించినప్పుడే తమకు పాలకుడు ఎలా వుండాలనేది నిర్దిష్టంగా కోరుకోవాల్సింది. ఎవడో ఒక రాజు కావాలనుకున్నాం. ఊరకున్న ప్రాణాన్ని ఉసురుపెట్టుకున్నాం. ఎంచుకుంటే ఉత్తమ పాలకుల్ని ఎంచుకోవాలి. లేనప్పుడు అసలు పాలకులే లేకుండటం మంచిది' అని కప్పలు తలపోశాయి. అసలు రాజుని కోరుకోవటమనేది ఎంత అజ్ఞానమో తెలిసివచ్చి కప్పలు పశ్చాత్తాప పడసాగాయి. ●